

## సీపీఎం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి

**నూతనకల్ ..సెప్టెంబర్ 10,(ప్రజా జ్యోతి):**

వీరనారి చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతిని చిల్పకుంట్ల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.. ఈ మేరకు ఆమె చిత్ర పటానికి పూల వేసి నివాళులు అర్పించారు..

వివరాలు 2లో





శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 పేజీలు:13


# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



- గతేడాదితో పోలిస్తే రెట్టింపు స్థాయిలో ఏర్పాట్లు
- నీటి లభ్యతకు అనుగుణంగా నిమజ్జన ప్రాంతాల ఎంపిక
- ముందుగానే రూట్‌మ్యాప్,ట్రాఫిక్ డైవర్షన్ ప్రకటించాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశం

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.గతేడాదితో పోలిస్తే ఈసారి రెట్టింపు స్థాయిలో ముందస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

మిగతా 2 లో

# పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి కక్కిరేణి శ్రీనివాస్ ప్రయత్నాలు



- కాంగ్రెస్ అధిష్టానానికి సిఫార్సు చేయాలని నేతలకు విజ్ఞప్తి

**వరంగల్‌ఖమ్మం (ప్రజా జ్యోతి):**

వరంగల్‌ఖమ్మం నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను పరిశీలించి, పార్టీ అధిష్టానానికి సిఫార్సు చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్ కోరారు.ఈ మేరకు తన బయోడేటాతో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలను కలిసి విజ్ఞప్తి చేశారు.

మిగతా 2 లో



# గణేష్ నిమజ్జనానికి పకడ్బంటీ ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి



గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ నరసింహ,అదనపు కలెక్టర్ బి.హరిసింగ్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని అన్నారు.ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో పరిస్థితులకు అనుగుణంగా నిమజ్జన ప్రాంతాలను ఎంపిక చేయాలని సూచించారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని అనువైన ప్రాంతాల్లో నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అధికారులు, పోలీసులు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. నిమజ్జన ప్రాంతాలు, రూట్‌మ్యాప్, ట్రాఫిక్ డైవర్షన్ తదితర వివరాలను ముందుగానే ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు.

### ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు

నిమజ్జన రూట్లలో రహదారి మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని, అప్రోచ్ రోడ్లను సక్రమంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు.రూట్ మార్పులకు అనుగుణంగా విద్యుత్ స్తంభాలు, తీగలు, ఇంటర్నెట్, టీవీ కేబుల్స్ తదితరాలను అవసరమైన చోట్ల సర్దుబాటు చేసి విగ్రహాల తరలింపునకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎత్తైన విగ్రహాల తరలింపును ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు.నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేరకు ప్లాట్‌ఫారాలు, బ్యారికేడ్లు, క్రేన్లు, లైటింగ్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. విగ్రహాల తరలింపు సమయంలో అడ్డుగా వచ్చే చెట్ల కొమ్మలను ముందుగానే తొలగించాలని అన్నారు.

### విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరా విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండపానికి నిబంధనల ప్రకారం విద్యుత్ కనెక్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని, అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసి ప్రమాదాలకు గురికావద్దని ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మండపాల్లో షార్ట్‌సర్క్యూట్‌కు అవకాశం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

### గజ ఈతగాళ్లు,వైద్య బృందాల ఏర్పాటు

నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన సంఖ్యలో గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు.ముందుగానే ఈతగాళ్లతో సమన్వయం చేసుకుని షిఫ్టుల వివరాలను తెలియజేయాలని సూచించారు. ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి, అత్యవసర మందులు, వైద్య సామగ్రిని సిద్ధంగా ఉంచాలని తెలిపారు.నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించి నిరంతరం పరిశుభ్రతను పర్యవేక్షించాలని అన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

### మండపాల వద్ద అత్యవసర సేవల వివరాలు

ప్రతి గణేష్ మండపంలో పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, వైద్య తదితర అత్యవసర సేవల అధికారుల సంప్రదింపు వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మండపాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను అధికారులు ముందుగానే పరిశీలించాలని అన్నారు.నిమజ్జనం సందర్భంగా జిల్లాలో మద్యం విక్రయాలకు అనుమతి లేకుండా చర్యలు తీసుకోవాలని, మద్య నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని, గణేష్ ఉత్సవ కమిటీలు పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖలకు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్,ఆర్డీవోలు,మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి కక్కిరేణి శ్రీనివాస్ ప్రయత్నాలు

మొదటిపేజీ తరువాయి

మొదట ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని జిల్లా కాంగ్రెస్ నాయకుడు మొరిశెట్టి లక్షాదితో కలిసి కక్కిరేణి శ్రీనివాస్ కలిశారు.అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు,తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిని కూడా కలిసి తన అభ్యర్థిత్వాన్ని అధిష్టానానికి సిఫార్సు చేయాలని కోరారు.పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగులు, విద్యావంతుల సమస్యలపై తనకు అవగాహన ఉందని,వారి గొంతుకగా శాసనమండలిలో పనిచేసే అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా శ్రీనివాస్ విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి దారావత్ వెంకన్న నాయక్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, గుణగంటి హేమ సతీష్, మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, దండు మైసమ్మ దేవాలయ చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు రాచకొండ శ్రీనివాస్, దండ అరవింద్ రెడ్డి, కక్కిరేణి ప్రసాద్, కందాల అమృత రెడ్డి, చిలుముల సైదిరెడ్డి, సైదులు, సోమేశ్, ధర్మా నాయక్ తదితరులు పాల్గొన్నారు.





# సీపీఎం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. కామ్రేడ్ చిట్యాల ఐలమ్మ భూమికోసం భుక్తికోసం వెట్టి చాకిరి విముక్తి కోసం ఇస్నూర్ దొరల ఆగడాలను అరికడుతూ ఎర్ర జెండా నీడలో అనేక ప్రజా పోరాటాలు నిర్వహించడంలో ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు.. భీమ్ రెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం నాయకత్వంలో పని చేసిన వీర వనిత ఐలమ్మ అని అన్నారు.. తుది శ్వాస విడిచే వరకు ఎర్రజెండా నీడలో నిలబడిన త్యాగశీలి అని కొనియాడారు.. ఆమె ఆశయ సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.. సెప్టెంబరు 10 నుండి 17 వరకు జరిగే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు శంకర్ రెడ్డి.. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చిల్పకుంట్ల ఉప సర్పంచ్ సామా సురేందర్ రెడ్డి, యూత్ నాయకుడు వార్డ్ నెంబర్ ఎల్లావుల నరేష్ యాదవ్, కూసు సైదులు, అంజపెల్లి లక్ష్మయ్య, బత్తుల తిరుమలేశు, బాణాల నర్సిరెడ్డి, కూసు రామచంద్రు, గునిగంటి మల్లయ్య, బోనగిరి మల్లయ్య, కూసు పరమేశు, జటంగి లింగయ్య, కూసు వెంకన్న, కట్ట లక్ష్మారెడ్డి, గునుగంటి పుల్లయ్య, రేసు జనార్దన్, గునిగంటి ప్రభాకర్, కూసు నవీన్, బాణాల మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# ఇండియా స్కిల్స్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

## -16 నుంచి 25 ఏళ్ల యువతకు అవకాశం

## - ఐటీఐ ప్రిన్సిపాల్ ఎన్. వెంకటేశ్వరరావు

**హుజూర్ నగర్ సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**

కేంద్ర ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి మరియు పారిశ్రామిక శిక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇండియా స్కిల్స్ 202627 సాంకేతిక నైపుణ్య పోటీలకు అర్హులైన యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హుజూర్‌నగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియా స్కిల్స్ పోటీలను 63 రకాల నైపుణ్య విభాగాల్లో జిల్లా, రీజినల్, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 16 నుంచి 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన యువత ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 15, 2026లోగా www.skillindiadigital.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఐటీఐ, ఏటీఎస్, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు సంబంధిత నైపుణ్యాలు కలిగిన యువత కూడా పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ అందించడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు కోరారు. మరిన్ని వివరాల కోసం 8247506920, 9160284139, 8499084414 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



# చాకలి ఐలమ్మకు ఘన నివాళి

**గరిడేపల్లి సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి) :**

గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రజక సంఘం అధ్యక్షుడు పాల్లేలి అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ ప్రథమ పౌరుడు బొల్లెపల్లి రామనాధం పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన ధైర్యసాహసా లు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. అనంతరం రజక సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రజక సంఘం సభ్యులు, గ్రామ ప్రజలకు సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రతిష్టాత్మక కాళోజి నంది అవార్డు అందుకున్న అడ్వకేట్ యరగాని సోనీ




**హుజూర్ నగర్ సెప్టెంబర్ 10: (ప్రజా జ్యోతి)**



కాళోజీ తెలంగాణ జూనియర్ లేడీ అడ్వకేట్ అసోసియేషన్ మరియు కాళోజి తెలంగాణ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రదానం చేసే ప్రతిష్టాత్మక నంది అవార్డుకు నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ యరగాని సోనీ ఎంపికయ్యారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ప్రతి ఏటా రాష్ట్రవ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల్లో ప్రాక్టీస్ చేస్తున్న జూనియర్ న్యాయవాదుల ప్రతిభను, వృత్తి పట్ల వారి అంకితభావాన్ని గుర్తించి జిల్లాకు ఒకరిని ఎంపిక చేసి ఈ పురస్కారాన్ని అందజేస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది నాంపల్లి క్రిమినల్ కోర్టులో జూనియర్ న్యాయవాదిగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన హుజూర్ నగర్ పట్టణానికి చెందిన యరగాని సోనీ ని కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేసి హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో అవార్డును ప్రధానం చేశారు. యరగాని సోనీ ఈ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు యరగాని సత్యనారాయణ గౌడ్, ఉమా ,కుటుంబ సభ్యులు,పలువురు సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. న్యాయవాద వృత్తిలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ కుమార్ , యరగాని శ్రీనివాస్, బెల్లంకొండ రమేష్ , తుమ్మ వెంకటేశ్వర్లు ,భరద్వాజ్, పరాషర్, వట్టికూటి వెంకటేశ్వర్లు, వట్టికూటి గురవయ్య , మధు, శ్యాంప్రసాద్ , నవీన్ ,హరీష్, ప్రశాంత్,శ్రీజ, శాన్వి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బి ఎన్ తిమ్మాపురం సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి జన్మదిన వేడుకలు



**భువనగిరి,సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి)**

భువనగిరి మండలం బిఎన్ తిమ్మాపురం సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి జన్మదిన సందర్భంగా వారి అభిమా నులు బి,ఎన్ తిమ్మాపురం గ్రామస్తులు యువకులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయగిరిలోని సహృ దయ అనాధా శ్రమంలో కేక్ కట్ చేసిన అనంతరం వృద్ధులకు అన్నదానం మరియు పండ్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మా బి ఎన్ తిమ్మాపూర్ సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి గారు ప్రజల కొరకు నిరంతరం ప్రజాసేవలో తరిస్తూ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పట్టు వదలని విక్రమా ర్కుడిలా ముందుకు సాగుతూ యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆశీర్వా దాల తో సమాజ ప్రగతి కోసం మీ సంకల్పం ఇలాగే కొనసాగాలని ముందు ముందు మీరు ఇంకా మరింత ఉన్నత పదవులు పొందాలని,బి ఎన్ తిమ్మాపురం పునరావాస నూతన గ్రామాన్ని సకలహంగులతో అభివృద్ధి చేసే శక్తిని మీకు ఆ భగవంతుడు ప్రసాదించాలని,నిండు నూరేళ్ల ఆయురా రోగ్యాలతో జీవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తహేరా బబ్లు,మోర రామ్ రెడ్డి, దొంకెన అశోక్ వల్లందాస్ పరమేష్ నకిరేకంటి సుధాకర్,ఎండి బాబా,దొంకెన మహేష్ పవన్ ముదిరాజ్,నకిరే కంటి రాము,కుచ్చుల మహేష్,రచ్చ మార్కం దేయ,జిన్న సత్య నారాయణ,తుమ్మల బిక్షపతి,రాసాల కరుణా కర్,అబ్బు ఏవిఆర్ అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# తరాలు మారిన చెరిగిపోని చరిత్ర చాకలి ఐలమ్మ

- వెంపటి లో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

**తుంగతుర్తి, సెప్టెంబర్ 10,(ప్రజా జ్యోతి):**

భూస్వాముల దోపిడికి వ్యతిరేకంగా పోరాడిన అసమాన్య ధైర్య వంతురాలు వీరనారి చాకలి ఐలమ్మ అని గ్రామ సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని వెంపటి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ధైర్యసహసాలను కొనియాడారు. ఐలమ్మ పోరాట పటిమ, ఆమే తెగువ యావత్ మహిళా లోకానికి ఆదర్శమని అన్నారు. ఆమె భూమి కోసం, దొరల పెత్తనాన్ని ధిక్కరించి, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత అని అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు ఐతరాజు అంజయ్య, తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, దాయం ఝాన్సీ రాజిరెడ్డి, అబ్బగాని సత్యనారాయణ గౌడ్, తప్పట్ల శంకర్, భాష బోయిన వెంకన్న, మడిపెద్ది సోమ నరసయ్య, రజక సంఘం నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణ

- మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డా.జె.ప్రసన్నకుమారి

**గరిడేపల్లి సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణ కలుగుతుందని ప్రిన్సిపాల్ డా.,జె.ప్రసన్నకుమారి అన్నారు.గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి పీఎం శ్రీ గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులు మట్టితో గణపతి విగ్రహాలను తయారు చేశారు. అనంతరం మట్టి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె. ప్రసన్నకుమారి మాట్లాడుతూ ఆది పూజలు అందుకునే గణపతిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని అన్నారు. విద్యార్థులకు సంకల్పసిద్ధి,మంచి బుద్ధి కలగాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాల తయారీని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో సతీష్ కుమార్, శైలజ,వెంకటేశ్వర్లు,వీరభద్రం, విష్ణువర్ధన్,డా.,కందుల శివకృష్ణ, డా.,శ్రవణ్‌కుమార్,దామ్లా, శాంతిప్రియ,శేఖర్,భూలక్ష్మి, నవాబ్ ప్రమీల,పార్వతి తదితర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.







# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్నే అవమానించడమే

- ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తారనే భయంతోనే సస్పెన్షన్ : తాటికొండ సీతయ్య

**తుంగతుర్తి, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

గత మూడు రోజులుగా జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో ప్రజా సమస్యలను చర్చించకుండా ప్రజాధనాన్ని వృథా చేస్తున్న ప్రభుత్వం.. అకారణంగా బీఆర్ఎస్ శాసనసభ్యులను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ...కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్నే అవమానించడమేనని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసి శాసనసభ సమావేశాలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉంటే ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీస్తారనే భయంతోనే వారిని సభకు దూరంగా ఉంచే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు, నిషేధిత జాబితా 22-ఏలో అక్రమంగా చేర్చిన భూముల వంటి అంశాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తారనే కారణంతోనే సస్పెన్షన్ వేటు వేశారని విమర్శించారు.కేసీఆర్ చావు కోరుకుంటున్నామని బహిరంగంగా ప్రకటించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ప్రభుత్వం, శాసనసభ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సీతయ్య డిమాండ్ చేశారు. ఆయన సభ్యత్వం పై అనర్హత వేటు వేయాలని కోరారు.ఎర్రవల్లి కేసీఆర్ ఫామ్ హౌస్ వద్దకు అక్రమంగా చొచ్చు కెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలీసులు పక్షపాత



వైఖరిని వీడి అందరికీ సమానంగా చట్టాన్ని అమలు చేయాలని కోరారు.అధికార పార్టీకి ఒక చట్టం, ప్రతిపక్షానికి మరో చట్టం ఉండకూడదని సీతయ్య అన్నారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై కూడా తగిన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన పోరాటాన్ని ప్రజలు మరువరని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకునే పరిస్థితి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు గుండగాని రాములు గౌడ్, పట్టణ అధ్యక్షుడు గోపగాని శ్రీనివాస్, మండల నాయకులు గుడిపాటి వీరయ్య, గోపగాని వెంకన్న, తాళ్లపల్లి యాకయ్య, మల్లెపాక రాములు, గడ్డం సోమేష్, పాలడుగు జలంధర్, బొజ్జ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ వెంకటరెడ్డి ని పరామర్శించిన ఐజేయు అధ్యక్షుడు కృష్ణారెడ్డి

**నల్లగొండ, సెప్టెంబర్ 10,( ప్రజాజ్యోతి ప్రతినిధి ):**

ఇటీవల రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు గాయపడ్డ నిడుమనూర్ ప్రజాజ్యోతి రిపోర్టర్ ఉమ్మడి వెంకట్ రెడ్డి ని గురువారం ఐ జె యు జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి పరామర్శించారు. ఆ ప్రమాదంలో ఎడమ చెయ్యి విరిగిపోయి నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స జరుపుకొని విశ్రాంతి తీసుకుంటున్నట్లు సమాచారం అందుకున్న కృష్ణారెడ్డి ఐజేయూ సెక్రెటరీ మహేందర్ రెడ్డి తో కలిసి ఆస్పత్రికి వెళ్లి వెంకట్ రెడ్డి పరామర్శించారు. గాయాల నుండి త్వరగా కోలుకుని, తిరిగి విధుల్లో చేరాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రజాజ్యోతి జిల్లా స్టాపర్ భూమిరెడ్డి నాగార్జున్ రెడ్డి ఉన్నారు.



# గణేష్ ఉత్సవాలలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- ఎస్‌హెచ్‌ఓ జె. జగన్

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని పోచంపల్లి ఎస్‌హెచ్ఓ జె. జగన్ సూచించారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవడంతోపాటు, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా డీజేలు, లౌడ్‌స్పీకర్లను పోలీసుల సూచనలు, నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, బైక్ స్టంట్లు, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వదంతులు, విద్వేషపూరిత సమాచారాన్ని ప్రచారం చేయకుండా ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వినాయక మండపాల నిర్వహకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ఎర్రవెల్లి టీఆర్ఎస్ నాయకులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి

## - ఎస్సీ సెల్ చైర్మన్ కాకునూరు మహేందర్

**భువనగిరి,సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి)**



ఈనెల 7వ తేదీ రోజున కేసీఆర్ గారి ఫామ్ హౌస్ ఎదుట చావు డప్పు కొట్టడానికి వేలాది సంఖ్యలో దళితులు వెళ్లడం జరిగింది రాజ్యాంగబద్ధం పదవిలో ఉన్నటువంటి స్పీకర్ ని వారి తల్లిని అవమానించినటువంటి తాత మధు ఎమ్మెల్సీ ని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. కానీ టిఆర్ఎస్ పార్టీ చేసిన తప్పును ఒప్పుకోకుండా ఆ పార్టీ ఎమ్మెల్సీ ని వెనుకేసుకొస్తూ యావత్తు దళిత జాతిని అవమానించినందుకు నిరసనగా కేసీఆర్ ఇంటి ముందు చావు డప్పు కార్యక్రమం చేపట్టడం జరిగింది అది అయిపోయిన తర్వాత అక్కడి బిఆర్ఎస్ నాయకులు దళితులు తిరిగిన నేల ఇది దీనిని వెంటనే శుద్ధి చేయాలని ఒక కార్యక్రమం చేపట్టి యావత్తు దళిత జాతిని మరోసారి వాళ్లు అవమానపరిచి తీవ్ర మనోవేదనకు గురి చేయడం జరిగింది.కావున అట్టి వారిపై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వారికి చట్టరీత్యా శిక్ష పడేలా చేయాలని భోనగిరి పట్టణ సిఐ కి ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కంప్లైంట్ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జాలిగం విగ్నేష్ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగారం శంకర్, కొండాపురం పాల్ తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లిలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**



భూస్వామ్య దోపిడీ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని గురువారం భూదాన్ పోచంపల్లిలో ఘనంగా నిర్వహించారు. మండల, పట్టణ రజక సంఘాల ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల రజక సంఘం అధ్యక్షుడు ఐతరాజు బిక్షపతి మాట్లాడుతూ భూమి,



భుక్తి, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల రజక సంఘం అధ్యక్షుడు ఐతరాజు బిక్షపతి, గౌరవ అధ్యక్షుడు చేరాల ప్రకాష్, పట్టణ రజక సంఘం అధ్యక్షుడు చేరాల నరసింహ, మండల ప్రధాన కార్యదర్శి లింగాల మధు, చేరాల లింగయ్య, గోరుగంటి రవీందర్, గరిసె జంగయ్య, లింగాల సురేష్, యంజాల కృష్ణ, ఇబ్రహీంపట్నం అంజయ్య, చింతల ఉపేందర్, బండిరాల సుశీల, లింగాల శ్రీనివాస్, గోరుగంటి దశరథ, గోరుగంటి శ్రీనివాస్, ఎంజాల నగేష్, ఎర్రబోతు మహేష్, చింతకింది సురేష్, కలుకూరి పాండు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రకు ప్రతీకగా దర్గా ఉర్సు ఉత్సవాలు..

- అక్టోబర్ 1 నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహణ..
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు డిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ ఆమేర్ ఆదేశాలు...

**నల్లగొండ సెప్టెంబర్ 10,(ప్రజా జ్యోతి):**





చారిత్రక ప్రాధాన్యత కలిగిన హజ్రత్ సయ్యద్ షా లతీఫ్ ఉల్లాఖాద్రి దర్గా ఉర్సు ఉత్సవాలను అక్టోబర్ 1 నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని డిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ ఆమేర్ అధికారులను ఆదేశించారు. దర్గా మెట్ల వద్ద ఉర్సు కమిటీతో ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు.ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తామని కమిషనర్ బి. కృష్ణ వంశీ తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో దర్గా అభివృద్ధి పనులు, ఘాట్ రోడ్డు పనులను పూర్తి చేస్తామని మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. దర్గా పవిత్రత, ఉర్సు వైభవం విషయంలో రాజీ ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉర్సు అధ్యక్షుడు మాసీఉద్దీన్, హాషం, అబిద్, ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్లు సమద్, ఇబ్రహీం, ఖలీల్, రఫీఉద్దీన్, ఖాజా మొహియుద్దీన్, సమీఉల్లా ఖాద్రి, సల్మాన్ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ సాగు వైపు అడుగులేయాలి

**గరిడేపల్లి, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**


రైతులు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ సాగు వైపు అడుగులు వేయాలని చైతన్య విశ్వవిద్యాలయ వ్యవసాయ విద్యార్థులు సూచించారు. మండల రైతులకు సేంద్రియ వ్యవసాయంపై విద్యార్థులు గీతాంజలి, వెన్నెల, అభివర్ష, శరణ్య, షిజాజబీన్, లహరి అవగాహన కల్పించారు. కంపోస్ట్, పశువుల పేడ, వర్మీకంపోస్ట్, జీవ ఎరువుల వినియోగంతో నేల సారాన్ని కాపాడుకోవచ్చన్నారు. పంట మార్పిడి, పచ్చిరొట్ట ఎరువులు, సహజ పద్ధతుల్లో చీడపీడల నియంత్రణపై వివరించారు. సేంద్రియ సాగుతో నాణ్యమైన దిగుబడులతో పాటు నేల ఆరోగ్యం, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



# గ్రామస్తులకు బోనాల పండుగ శుభాకాంక్షలు:సర్పంచి

**చింతపల్లి సెప్టెంబర్ 05(ప్రజాజ్యోతి)**

చింతపల్లి మండలం గొడుకోండ్ల గ్రామంలో నేడు జరగబోయే బోనాల పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చినటువంటి ఆడపడుచులకు, కుటుంబ సభ్యులకు మరియు బంధుమిత్రులకు,గ్రామస్తులకు సర్పంచి కేసగోని వెంకటయ్య గ్రామస్తులక బోనాల పండుగ శు భాకాంక్షలు తెలిపారు.ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతికి ప్రతీకగా బోనాల పండుగ అన్నారు.గ్రామ దేవతల ఆశీస్సులు ప్రతి ఒక్కరిమీద ఉండాలని ఆయన కోరారు.



# ట్రాన్స్ జెండర్లు చట్టాలను గౌరవిస్తూ గౌరవప్రదమైన జీవనం సాగించాలి

- బలవంతపు వసూళ్లు, ప్రజల వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు..
- నల్గొండ డీఎస్పీ కే. శివరాం రెడ్డి

**నల్గొండ, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

నల్గొండ పట్టణంలో బలవంతపు వసూళ్లు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, వేధింపులకు పాల్పడే ఘటనలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని నల్గొండ డీఎస్పీ కే. శివరాం రెడ్డి హెచ్చరించారు. ట్రాన్స్‌జెండర్లతో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు..దుకాణాలు, వ్యాపార సంస్థలు, ఇళ్లు, నూతన గృహప్రవేశాలు, షాపుల ప్రారంభోత్సవాలు, వివాహాలు, ఇతర శుభకార్యాల సందర్భంగా ఎవరినీ బలవంతంగా డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయరాదని స్పష్టం చేశారు. స్వచ్ఛందంగా అందించే సహాయాన్ని మాత్రమే స్వీకరించాలని, బెదిరింపులు, అసభ్య ప్రవర్తన, వేధింపులు లేదా బలవంతపు వసూళ్లకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు కూడా సమాజంలో భాగమేనని, వారు గౌరవప్రదంగా జీవించేందుకు పోలీస్ శాఖ సహకరిస్తుందని పేర్కొన్నారు. అదే సమయంలో ప్రజల హక్కులు, స్వేచ్ఛకు భంగం కలగకుండా చట్టాలను గౌరవిస్తూ వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు ఆదిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సైదాబాబు, షరీఫ్‌తో పాటు పలువురు ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.




# మధుయాష్కి గౌడ్ కి శుభాకాంక్షలు తెలిపిన: సర్పంచి

**చింతపల్లి సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి)**

తెలంగాణకు కాంగ్రెస్ సెంట్రల్ పార్టీ కమిటీలో మరో కీల పదవి దక్కింది.తెలంగాణకు చెందిన మధుయాష్కీకి చైర్ పర్సన్ గా కాంగ్రెస్ హైకమాండ్ నియమించింది. తెలంగాణ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏఐసిసిలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రాతినిధ్యం పెరుగుతుంది.తెలంగాణలోని నిజామా బాద్ లోకసబ్ నియోజకవర్గం నుండి రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడుగా ఎన్నికయ్యాడు.గతంలో ఆయన అధికార ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించారు.తాజాగా తెలంగాణలోని మధుయాష్కి గౌడ్ కి ఏఐసిసి చైర్ పర్సన్ గా నియమిచిన సందర్భంగా చింతపల్లి మండలంలోని మోదుగుల మల్లెపల్లి సర్పంచి ముద్దం మల్లేష్ గౌడ్ కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



# భక్తిశ్రద్ధలు,సోదరభావంతో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలి

## - హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి పిలుపు





**హాలియా,సెప్టెంబర్10(ప్రజా జ్యోతి)**

వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో జరుపుకోవాలని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకుని హాలియా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి పీస్ (శాంతి) కమిటీ సమావేశం నిర్వహించారు.మున్సిపల్ కమిషనర్ కే.రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి చైర్మన్ చింతల చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలందరూ పరస్పర సహకారంతో మెలిగి, వేడుకలను దిగ్విజయం చేయాలని చైర్మన్ కోరారు. వినాయక విగ్రహాల ఏర్పాటు వల్ల ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలని సూచించారు. మున్సిపల్,రెవెన్యూ,మండల పరిషత్,పోలీస్ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, శానిటేషన్ సిబ్బంది సహాయంతో ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ కె.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విగ్రహాల ప్రతిష్ఠాపన,నిమజ్జనం రోజుల్లో స్థానిక కౌన్సిలర్లు,ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు, విద్యుత్ శాఖ లైన్‌మెన్లు వీధుల్లోని విద్యుత్ వైర్లను నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు.కరెంటు తీగలు విగ్రహాలకు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఊరేగింపు సాగే మార్గాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజ రమేష్ యాదవ్ అనుముల మండల తహసీల్దార్ బి.చందర్ రావు,కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు,అనుముల మండల సర్పంచుల కమిటీ అధ్యక్షులు,మైనారిటీ మత పెద్దలు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,పంచాయతీరాజ్, విద్యుత్,వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కుంభం సహకారంతో పెద్దగూడెంలో 24 గంటల విద్యుత్

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో మండలంలోని పెద్దగూడెం గ్రామంలో తాగునీటి సరఫరాకు 24 గంటల విద్యుత్ అందించేందుకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం సర్పంచ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పక్కిరు లతా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో నీటి సరఫరాకు విద్యుత్ సమస్య లేకుండా 24 గంటల విద్యుత్ సరఫరా అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. గ్రామ ప్రజల సమస్యను పరిష్కరించేందుకు సహకరించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని కోరారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ శేఖర్‌రెడ్డి, గ్రామ పెద్దలు పి. మల్లారెడ్డి, కె. యాదిరెడ్డి, గట్టు రాంరెడ్డి, వార్డు సభ్యులు, యువకులు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చేనేత సంఘం చైర్మన్ వేణుకు సన్మానం

**రామన్నపేట సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి)**

రామన్నపేట పట్టణ కేంద్రంలో చేనేత సహకార సంఘం చెఎర్మన్ పెండెం వేణుకి మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు బందెల రాములు, గంగాపురం యాదయ్య, బొడ్డు సైదులు, బొడ్డు శంకరయ్య ,తదితరులు పాల్గొన్నారు.



# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి

## - అణచివేత,భూస్వామ్య వ్యవస్థకు ఎదురొడ్డి నిలిచిన వీరనారి

## - నేటి తరానికి ఐలమ్మ చరిత్రను తెలియజేయాలి

## - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్,ఎస్పీ నరసింహ







**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి):**

అణచివేత,భూస్వామ్య వ్యవస్థకు ఎదురొడ్డి ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి తరతరాలకు ఆదర్శమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.ఆమె ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ పురోగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో ఆమె చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పోషించిన కీలక పాత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.నాటి అణచివేతకు,భూస్వామ్య దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచిన ఆమె ధైర్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.సామాజిక,ఆర్థిక,విద్యా రంగాల్లో జిల్లా ప్రజలు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.చాకలి ఐలమ్మ వంటి మహనీయుల చరిత్రను నేటి తరానికి అందించడంతో పాటు యువత చదువుతోపాటు అన్ని రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలన్నారు.రాజ్యాంగం కల్పించిన సామాజిక,ఆర్థిక,రాజకీయ హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.

### మహిళల చైతన్యానికి ఐలమ్మ స్ఫూర్తి

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి మహిళలకు ఆదర్శనీయమని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు.ఐలమ్మ చూపిన తెగువ,ధైర్యం,ఆత్మవిశ్వాసం నుంచి నేటి తరం స్ఫూర్తి పొందాలని సూచించారు.1895లో జన్మించిన ఐలమ్మ నాటి సామాజిక,ఆర్థిక అణచివేత పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్నారని గుర్తుచేశారు.విస్నూరు దేశ్‌ముఖ్ దౌర్జన్యాలు,దొరల గడీల అన్యాయాలకు వ్యతిరేకంగా తన కౌలు భూమి కోసం పోరాడటమే కాకుండా, సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం ఉద్యమించారని కొనియాడారు.ప్రస్తుత ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ పాలనలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. అన్యాయాలను శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించే ధైర్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. మహిళల భద్రత, చైతన్యంపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.మహిళలను కేవలం కుటుంబానికే పరిమితం చేయకుండా విద్య, ఉద్యోగం, రాజకీయ, సామాజిక తదితర అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ఎస్పీ సూచించారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో సమాజంలో చైతన్యం తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, బీసీ సంక్షేమ అధికారి విశాల్, నాయకులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, భోమ్మగాని శ్రీనివాస్, బంటు కృష్ణ, చింతలపాటి చిన్న శ్రీరాములు, మట్టిపల్లి సైదులు, పోతుగంటి వీరాచారి, చల్లమల నరసింహ, తల్లమల్ల హుషేన్, ధున్నా శ్యామ్‌తో పాటు జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడిగా కొండగడుపుల ప్రవీణ్ కుమార్

## - నియామకానికి సహకరించిన నాయకులకు

## ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ప్రవీణ్ కుమార్

**తుంగతుర్తి, సెప్టెంబర్ 10,(ప్రజా జ్యోతి);**

ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడి గా మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన కొండగడుపుల ప్రవీణ్ కుమార్ నియామక మయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ...తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్,నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతమ్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ సంఘం సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ, ఎన్ ఎస్ యు ఐ జాతీయ అధ్యక్షులు వినోద్ జాఖర్,రాష్ట్ర అధ్యక్షులు యాడవెల్లి వెంకటస్వామి తదితరులకు ప్రవీణ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం మరింత బాధ్యతాయుతంగా




పనిచేస్తానని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన పార్టీ పెద్దల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. జిల్లాలో విద్యార్థి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ ను వెంపటి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, యువత అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం

## - స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

## - సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి

**నాగారం సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి.**

ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి కోరారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాను ప్రకాష్ యాదవ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామ్‌రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, వార్డు సభ్యులు, రేషన్ డీలర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉన్నత శిఖరాలు డీఐఈఓ దస్రూనాయక్

**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 10,(ప్రజాజ్యోతి):**

విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పక్కా ప్రణాళికతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని డీఐఈఓ దస్రూనాయక్ ఆకాంక్షించారు. గురువారం మండల పరిధిలోని శ్రీకాంతి జూనియర్ కళాశాల, ఎస్టీ గురుకుల బాలికల కళాశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం, విద్యాబోధన తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి విద్యా ప్రగతిపై ఆరా తీశారు. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. కళాశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు, అధ్యాపకులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ పరీక్షలకు సమర్థంగా సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సతీష్‌కుమార్, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు దుండిగళ్ల అశోక్, శారద, యర్రమాద గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బిఎల్‌ఓ లకు ఘన సన్మానం

**వలిగొండ సెప్టెంబర్10 (ప్రజాజ్యోతి న్యూస్):**

వలిగొండ మండలం పులిగిల్ల గ్రామంలో సమగ్ర ఓటర్ నమూనా (ఎస్ఐఆర్) ప్రక్రియను వంద శాతం విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా గ్రామంలోని బూత్ లెవల్ అధికారులును ఘనంగా సన్మానించడం జరిగిందని వలిగొండ తహసిల్దార్ దశరథ తెలిపారు. గురువారం రోజున గ్రామంలోని గ్రామపంచాయతీ వద్ద ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని విజయవంతం చేసిన బిఎల్వో లు పల్లెర్ల సతీష్, బంధారపు మంగమ్మ, బందారపు మహేశ్వరి, ఫైళ్ళ పుణ్యవతి లకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఓటర్ నమోదు ప్రక్రియను గ్రామంలో అధికారులు, బీఎల్‌ఓల సమన్వయంతో ఓటర్ నమోదు ప్రక్రియను పూర్తి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రక్రియలో ప్రతి అర్హుడిని నమోదు చేయడంలో గ్రామస్థులు సహకరించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సైదులు, జిపిఓ అనిత పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీ ఆమోదం లేకుండా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు

- కౌన్సిల్ సభ్యులు లొల్లి పెట్టి ఆమోదం తెలపక పోవడం తో విరమణ
- ఏక పక్షంగా వ్యవహరిస్తున్న
- కమిషనర్ చైర్మన్ పై చర్యలకు డిమాండ్

**భువనగిరి,సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి)**



భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం లేకుండా కొటేషన్లను పిలిచిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకో వాలని టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ చిన్న స్వాతి అభ్యం తరం,తెలపగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ మరియు బిజెపి కౌన్సిలర్ మహిళా కౌన్సిలర్ మాట్లాడుతూ,జూన్ 29 2026 రోజున జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశం ఎజెండాలో పెట్టినటువంటి నాలుగు ఎలక్ట్రిక్,చెత్త వాహనాలు కొనుగోలుకై ప్రతిపాదించగా దానిని ఆమోదించకుండా ముందుగా ఇంతకుముందు ఏదైతే మున్సిపాలిటీలో నడుస్తున్నాయో వాటిని చూసి వాటి సక్సెస్ రేట్ చూసి తర్వాత కొనుగోలుకై ఆమోదం తెలుపుదామని చెప్పడం జరిగిందని ఇతర సభ్యులు అందరూ ముక్త కంఠంతో మున్సిపల్ చైర్పర్సన్ కమిషనర్ మరియు అధికారులు కలిసి కౌన్సిల్ సభ్యులందరినీ అవమానపరిచేలా వారి అధికారాలను దుర్వినియోగం చేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసేలా ఒక్కరికే లాభం చేకూరేలా కేవలం 2రోజుల వ్యవధికి కొటేషన్లను పిలవడం జరిగింది.మున్సిపల్ చరిత్రలోనే కౌన్సిల్ ఆమోదం లేకుండా 60 లక్షల రూపాయలను కొటేషన్లను పిలిచే కార్యక్రమం చాలా బాధా కరమని వెంటనే వారిపై యాదాద్రి జిల్లా కలెక్టర్ అదనపు లోకల్ బాడీస్ కలెక్టర్ చట్టరీత్యా చర్యలు తీసుకుని మున్సిపల్ కౌన్సిల్ గౌరవాన్ని, ప్రజల నమ్మకాన్ని కాపాడా ల్సిందిగా కోరడం జరిగింది.

## కష్టకాలంలో కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా మృతుల కుటుంబాలను పరామర్శించిన సర్పంచ్ గోసుల రాజేష్

రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత

**నడిగూడెం, సెప్టెంబర్ 10, ప్రజా జ్యోతి:**

నడిగూడెం మండలం చెన్నకేశవపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పచ్చిగోళ్ల గురవయ్య, మిర్యాల భారతమ్మ కుటుంబాలను గ్రామ సర్పంచ్ గోసుల రాజేష్ పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను కలిసి వారి బాధను పంచుకున్న ఆయన, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారి కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మృతుల కుమారులు పచ్చిగోళ్ల ఉపేందర్, మిర్యాల ఉపేందర్‌లకు రూ. 5 వేల చొప్పున రెండు కుటుంబాలకు మొత్తం రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కటికల పుల్లయ్య, వార్డు సభ్యులు పప్పుల ఉపేందర్, శివరాత్రి వీరబాబు, కాంగ్రెస్ నాయకులు అనంతుల ఉపేందర్, సంకోజ్ జానయ్య తదితరులు పాల్గొన్నారు.



# లైసెన్స్ సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే ద్వారా రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్తా
- నడిగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్క బిక్షపతి

**నడిగూడెం, సెప్టెంబర్ 10, ప్రజా జ్యోతి:**

భూభారతి రీ–సర్వేలో విధులు నిర్వహిస్తున్న లైసెన్స్ సర్వేయర్ల సమస్యలను ఎమ్మెల్యే ద్వారా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని నడిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొక్క బిక్షపతి హామీ ఇచ్చారు. గురువారం భూభారతి రీ–సర్వే అవగాహన సదస్సులో భాగంగా లైసెన్స్ సర్వేయర్లు తమ సమస్యల పరిష్కారం కోరుతూ బిక్షపతికి వినతిపత్రం అందజేశారు. లైసెన్స్ సర్వేయర్లకు ప్రస్తుతం అమలులో ఉన్న కమిషన్ విధానాన్ని రద్దు చేసి, నెలకు రూ. 30 వేల గౌరవ వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. తమ సమస్యలను ఎమ్మెల్యే ద్వారా రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని సూర్యాపేట జిల్లా ఎల్ఎస్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సోను సాహెబ్‌తో పాటు లైసెన్స్ సర్వేయర్లు విజ్ఞప్తి చేశారు. వారి సమస్యలను సానుకూలంగా విన్న బిక్షపతి, లైసెన్స్ సర్వేయర్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా కృషి చేస్తానని తెలిపారు. సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.



# మైదానంలో గెలుపే లక్ష్యంగా దూసుకెళ్లాలి!

## - చదువుతోపాటు క్రీడల్లోనూ విజయకేతనం ఎగరేయాలి

## - రాష్ట్రస్థాయిలో సత్తా చాటి నడిగూడెం ఖ్యాతిని చాటాలి: తిరుపతమ్మ సుధీర్





**నడిగూడెం, సెప్టెంబర్ 10, ప్రజా జ్యోతి:**

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ పిలుపునిచ్చారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి అండర్-14, అండర్-17 క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. మండల విద్యాధికారి వనం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తిరుపతమ్మ సుధీర్ మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందించడంతో పాటు జీవితంలో విజయాన్ని సాధించే స్ఫూర్తిని అందిస్తాయన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు కృషి చేస్తోందన్నారు. మండల స్థాయి పోటీలను తొలి మెట్టుగా తీసుకుని మరింత పట్టుదలతో సాధన చేయాలని క్రీడాకారులకు సూచించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ కనబరిచి నడిగూడెం మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సహకారంతో మండలంలోని క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అంతకుముందు హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి, పాఠశాల దాత కొల్లు పాపయ్య చౌదరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్ఐ తేజస్విని, సర్పంచ్ దున్నా శ్రీనివాస్‌లతో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘు, శ్రీదేవి, క్రీడా పోటీల నిర్వాహక కన్వీనర్ పీడీ నవీన్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## లతీఫ్ కుటుంబానికి బీజేపీ అండ

## రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత.

**నడిగూడెం, సెప్టెంబర్ 10,ప్రజా జ్యోతి:**

అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన బీజేపీ నడిగూడెం మండల మాజీ ఉపాధ్యక్షుడు షేక్ లతీఫ్ కుటుంబాన్ని బీజేపీ మండల నాయకులు గురువారం పరామర్శించారు. మండల కమిటీ ఆధ్వర్యంలో కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు బండారు వీరబాబు యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. లతీఫ్ కుటుంబానికి భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు రౌత్ కళ్యాణ్, కేసగాని పాపయ్య, నాయకులు బీరవెల్లి గోపాల్‌రెడ్డి, మామిడి రామకృష్ణ, ముప్పా నరసింహారావు, దున్న సతీష్, చెన్నకేశ గోపాలకృష్ణ, చిలకా బాలకృష్ణ, బండారు శోభారాణి, తాళ్లూరి రామకృష్ణ, రౌత్ వీరేంద్రవర్మ, దుస్సా గోపి తదితరులు పాల్గొన్నారు.



## రెండవసారి దళిత వీర్ అవార్డు కి ఎంపిక

**నార్కట్ పల్లి , సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి):**

నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలం తొండలవాయి గ్రామానికి చెందినచింతా లక్ష్మణ్ కి గుంటూరులో జరిగిన దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలోదళిత పల్లె వీరుడు కొమ్మర్ల అనిల్ కుమార్ వర్ధంతి సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ దళిత వీర్ అవార్డు ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్య రావు తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లాలో దళిత సంఘాల, ప్రజా సంఘాల నాయకులు పలువురు అభినందించారు.



## ఐలమ్మ పోరాట స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలి

**హుజూర్ నగర్ సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో మహిళలు అన్యాయాలు, దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కోవాలని పట్టణ లాండ్రీ షాప్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఇందిరాల నరసయ్య అన్నారు. ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు ఆమె పేరు పెట్టాలని, పాలకుర్తిలో స్మృతివనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బ్రహ్మం, మురళి, శ్రీనివాస్, ఉపేందర్, రాంబాబు, అంజి శ్రీనివాస్ నరసింహారావు పిచ్చయ్య రామారావు తిరుపతయ్య నారాయణ నాగేశ్వరావు వీరస్వామి యాదగిరి వెంకటరెడ్డి కోటయ్య చంటి మేర రవి శ్రీనివాస్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



# భూమి కోసం.. భుక్తి కోసం.. పోరాడిన వీరనారి ఐలమ్మ!

## - భూస్వామ్య పెత్తందారులకు ఎదురు నిలిచిన ధీరవనిత

## - ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఆశయాల సాధనకు కృషి.

**నడిగూడెం, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**



భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొరట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొరట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. వీర తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. పాలకుర్తిలో కౌలుకు తీసుకున్న భూమిలో పంట సాగు చేస్తున్న సమయంలో దొరలు ఆమె పొలం, పంటను నాశనం చేసేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఆ సమయంలో ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు నాయకులు భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి తదితరులు ఐలమ్మకు అండగా నిలిచి పంటను కాపాడారని పేర్కొన్నారు. దీంతో ఆగ్రహించిన దొరలు ఐలమ్మ ఇంటిని తగలబెట్టినా ఆమె వెనుకడుగు వేయకుండా పోరాటాన్ని కొనసాగించారని తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏనుగుల వీరాంజనేయులు, తంగెళ్ల లింగయ్య, తంగెళ్ల సైదులు, కొరట్ల వినయ్, మండవ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుక

**రామన్నపేట సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి.**

ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని రామన్నపేట మండల వృత్తి దారుల సంఘం అధ్యక్షుడు కొండూరు శంకర అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉద్యమ నాయకురాలు వేముల పుష్ప. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రకార్యదర్శి  దైద రవీందర్ హాజరయ్యారు వారు మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ సేవలు ఈ సమాజానికి ఎంతో ముఖ్యమని ఆమె చేసిన పోరాటం ఆమె ధైర్య సాహసాలు ఆమె త్యాగం సమాజానికి కీర్తిని  గడించింది కాబట్టి  నేటి తరం ఆమెను ఆదర్శంగా తీసుకోని ముందుకు నడవాలని సూచించారు ప్రతి ఒక్క పౌరుడు ఐలమ్మలా సమాజానికి సేవ చేయాలని చెప్పారు .ఈ కార్యక్రమంలో  కాంగ్రెస్ జిల్లా నాయకులు రాజిరెడ్డి వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎండి జమీరుద్దీన్, గుత్తా నర్సిరెడ్డి, జెల్లా వెంకటేష్, ర్రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆమనగంటి స్వామి ,రజక సంఘం అధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ముండ్లకొండ రమేష్ , మొన్న ఉప్పలయ్య ,పట్టణ అధ్యక్షులు అక్కినపల్లి లింగయ్య ,మండల కమిటీ సభ్యులు నడిగోటు రమేష్, మరియు వివిధ గ్రామాల అధ్యక్షులు నడిగోటి పాండు, ఎలిమినేటి యాదయ్య, గంప సత్తయ్య, యాదగిరి, మాంద్ర మల్లేష్ ,దామునూరు శ్రీను, మాంద్ర కిష్టయ్య, మహేష్, అముదా లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.



# ఫార్మర్ రిజిస్ట్రీ ప్రతి రైతు నమోదు చేసుకోవాలి

**పాలకవీడు, సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి):**



దేశవ్యాప్తంగా ఉన్న రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగంలో పారదర్శకత, డిజిటల్ విప్లవమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రవేశపెట్టింది. ఫార్మర్ రిజిస్ట్రీ యొక్క ఆవశ్యకత ప్రభుత్వ పథకాలకు అనుసంధానం భవిష్యత్తులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పీఎం కిసాన్, పంటల బీమా, సబ్సిడీ ఎరువులు విత్తనాలు వంటి పథకాలు పొందడానికి ఫార్మర్ ఐడి తప్పనిసరి కానుంది. సరళమైన లోన్ ప్రక్రియ బ్యాంకుల చుట్టూ తిరిగే పని లేకుండా, డిజిటల్ భూమి రికార్డుల ఆధారంగా కేవలం ఒక గంటలోనే కాగితారహిత పంట రుణాలు పొందే వీలుంటుంది పారదర్శకత అర్హులైన అసలైన రైతులకు మాత్రమే లబ్ధి చేకూర్చడం. భూమి వివరాల అనుసంధానం రైతు ఆధార్ నెంబర్ మొబైల్ నెంబర్లను వారి భూమి రికార్డులతో పాస్బుక్ వివరాలు డిజిటల్ గా అనుసంధానిస్తారు. జాన్ పహాడ్ క్లస్టర్ పరిధిలో 3153 మంది రైతులకు గాను ఇప్పటివరకు 2730 మంది రైతులు నమోదు చేసుకున్నారు. కావున మిగిలిన వారు వెంటనే రైతు వేదిక జాన్ పహాడ్ ను సంప్రదించి ఫార్మర్ ఐడి నమోదు చేసుకోగలరు. కేంద్ర ప్రభుత్వం ఎరువుల యాప్ నందు ఫార్మర్ రిజిస్ట్రీ ని తప్పనిసరి చేసినది. ఎరువులు సులువుగా పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని ఏ ఈ ఓ గోపి తెలిపారు.

# అద్దె చెల్లించలేదని తహసీల్దార్ కార్యాలయంకు తాళం

**పాలకవీడు, సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి):**

దాదాపు రెండు సంవత్సరాల నుండి అద్దె చెల్లించలేదని తహసీల్దార్ కార్యాలయంకు తాళం వేసిన ఘటన పాలకీడు మండల కేంద్రంలో చోటుచేసుకుంది.. వివరాలలోకి వెళితే 2016 నూతన కార్యాలయం మండల కేంద్రంలో జనార్దన్ రెడ్డి ఇంటిని అద్దెకు తీసుకొని  ప్రస్తుతం వరకు అందులోనే కొనసాగుతున్నారు. కానీ గత రెండు సంవత్సరాలుగా అద్దె చెల్లించలేదని ఇంటి యజమాని అవేదన వ్యక్తం చేస్తూ గురువారం ఉదయం కార్యాలయంకు తాళం వేసారు. తన అద్దె చెల్లిస్తేనే తాళం తీస్తానని లేకపోతే తీసే ప్రసక్తే లేదని కళాఖండిగా తేల్చి చెప్పారు.

**అద్దె చెల్లించట్లేదు.. యజమాని**

అద్దె చెల్లించాలని ఉన్నతాధికారులకు వ్రాత పూర్వకంగా కోరినా వారి నుండి ఎటువంటి స్పందన లేదు. రెండు సంవత్సరాల నుండి అద్దె చెల్లించట్లేదు అందుకే ఆఫీసు కి తాళం వేసాను. గతంలో కూడా అద్దె కోసం ఇబ్బందులు వచ్చాయి. కానీ రెండు సంవత్సరాలు అయినా స్పందన కరువు. కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో ఎవరిని అడిగినా పట్టింపు లేదు అందుకే తాళం వేసాను. అద్దె చెల్లించి కొనసాగాలని, లేకపోతే అద్దె చెల్లించి ఖాళీ చేయాలని అన్నారు.




# అంగన్వాడిలో ఆకస్మిక తనిఖీ

**నూతనకల్ ..సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

మండల పరిధిలోని గుండ్ల సింగారం అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో సునీత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌లో పిల్లల సంఖ్య 7 నమోదై ఉండగా, కేంద్రంలో ఇద్దరు పిల్లలు మాత్రమే హాజరుకావడంతో అంగన్వాడీ టీచర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఈరోజు హాజరుకాలేదని అంగన్వాడి టీచర్ ఎంపీడీవోకు సమాధానం ఇచ్చారు. విద్యార్థులకు అందించాల్సిన భోజనం తయారీకి వినియోగించే గ్యాస్ పనిచేయకపోవడంతో పిల్లలకు తన ఇంటి నుంచి భోజనం తీసుకువస్తున్నట్లు టీచర్ తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా అంగన్వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో సూచించారు. పిల్లల హాజరు, వారి సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారికి సూచించారు..



# బిఆర్ఎస్ నాయకులు ముందస్తు అరెస్ట్

**నూతనకల్..సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

బిఆర్ఎస్ అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్ మాజీ పిఎసిఎస్  చైర్మన్ కనకటి వెంకన్న లను గురువారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ అరెస్టులు హేయమైన చర్యని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు తమ పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు.



# మిర్యాలగూడ క్లస్టర్ ఎపిడి గా జ్యోతిలక్ష్మి

**మిర్యాలగూడ,సెప్టెంబర్ 10, (ప్రజాజ్యోతి) :**

మిర్యాలగూడ క్లస్టర్ గ్రామీణ అభివృద్ధి అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ (ఎపిడి)గా గార్లపాటి జ్యోతిలక్ష్మి గురువారం సాయంత్రం మండల పరిషత్ ఆవరణలోని క్లస్టర్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించారు.గతంలో దామరచర్ల, మిర్యాలగూడ లలో ఎంపిడిఓ గా భాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉంది. ఈ ప్రాంతం పై పూర్తి అవగాహన పూర్తిగా కలిగిన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, వి బి జి రామ్ జి పథకం సంబంధించిన కార్యక్రమాలు, అభివృద్ధి పనులనుసమర్ధవంతంగా పర్యవేక్షిస్తూ, ఉద్యోగస్తులను సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను మరింత ముందుకుతీసుకువెళ్తానని అన్నారు. జ్యోతిలక్ష్మి కి మిర్యాలగూడ మండల పరిషత్ సూపరింటెండెంట్ పి. కరుణాకర్ రావు, క్లస్టర్ ఇసి ఎం. కళావతి సిబ్బంది బొకే అందించి స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.



# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం - జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వర్ధంతి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి):**

వీరనారి చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పట్టుదల, ఆత్మవిశ్వాసం నేటి తరానికి ఆదర్శమని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అన్యాయానికి,అణచివేతకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన వీరోచిత పోరాటం సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు.సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటం,చూపిన ధైర్యం,పట్టుదల తరతరాలకు ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు.చాకలి ఐలమ్మ త్యాగాలను,సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి,స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సీఐ చరమందరాజు, ఆర్ఐలు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు సాయిరాం, అన్వర్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# హిజ్రాలు ప్రజలను ఇబ్బంది పెట్టినా, బలవంతంగా డబ్బులు వసూలు చేసిన కఠిన చర్యలు తప్పవు...!

## - ఇంచార్జ్ డిఎస్పీ రవి హిజ్రాలకు కౌన్సిలింగ్





**మిర్యాలగూడ, సెప్టెంబర్ 10,(ప్రజాజ్యోతి):**

మిర్యాలగూడ డివిజన్ వ్యాప్తంగా శుభకార్యాల పేరిట హిజ్రా ( ట్రాన్స్ జెండర్) లు ప్రజలను ఇబ్బంది పెట్టినా, బెదిరింపులకు గురిచేసినా, డబ్బులు ఇవ్వాలంటూ బలవంత పెట్టినా కఠిన చర్యలు తప్పవని మిర్యాలగూడ ఇంచార్జ్ డిఎస్పి జి.రవికుమార్ హెచ్చరించారు. గురువారం సబ్ డివిజన్ కార్యాలయంలో మిర్యాలగూడ పరిధిలోని హిజ్రాలకు కౌన్సెలింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొంతమంది హిజ్రాల ఆగడాలు మితిమీరిపోయాయని, ప్రజల నుండి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ప్రజలు తమ ఇళ్లలో గృహప్రవేశాలు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకునే సమయంలో హిజ్రాలు గుంపులుగా వెళ్లి డబ్బులు కావాలని బెదిరింపులకు గురి చేస్తున్నారని, నిరాకరిస్తే అసహ్యంగా వ్యవహరిస్తున్నారని, నానా దుర్భాషలాడుతున్నారని, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని మండిపడ్డారు. ఆయా శుభకార్యాల సమయంలో యజమానులు తమకు తోచినంత ఎంత ఇస్తే అంత తీసుకొని వెళ్లాలని, దౌర్జన్యం బలవంతం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డివిజన్ వ్యాప్తంగా ఎక్కడైనా హిజ్రాల ఆగడాలు మితిమీరి పోతే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐలు ఎం. నాగభూషణరావు, జె సోమ నరసయ్య, పి. నాగ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# వికలాంగుల బాలుర వసతి గృహాన్ని సందర్శించిన... జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి హిమబిందు

- వసతి గృహాన్ని పరిశుభ్రంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచుకోవాలి..
- విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..
- అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలి..
- డి ఎల్ ఎస్ ఎ కార్యదర్శి హిమబిందు.





**నల్గొండ సెప్టెంబర్ 10,(ప్రజా జ్యోతి):**

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి హిమబిందు వికలాంగుల బాలుర కళాశాల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వివిధ వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. వసతి గృహంలోని నిత్యవసర నిల్వలు, టాయిలెట్లు, పరిసరాలు, పరిశుభ్రత మరియు విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి అనంతరం ఆమె మాట్లాడుతూ..వసతి గృహాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.విద్యార్థులతో

**ఆత్మీయంగా మాట్లాడారు..**

విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలు, వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలు, అవసరమైన సహాయ సహకారాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ సమస్యలను స్వేచ్ఛగా తెలియజేయాలని, వారి హక్కులు మరియు చట్టపరమైన రక్షణలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా




విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ, న్యాయ సేవలు మరియు తమ హక్కులను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా అందుబాటులో ఉన్న న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వసతి గృహం సీనియర్ అసిస్టెంట్ బాలయ్య , జిల్లా వయోవృద్ధుల శాఖ ఫీల్డ్ ఆఫీసర్ నాగిరెడ్డి,సింహాద్రి, వసతి గృహ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్ శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గుప్త నిధుల వేటలో ముఠా అరెస్ట్!

## - పురాతన ఆలయాల వద్ద అర్ధరాత్రి అక్రమ తవ్వకాలు
## - ఎనిమిది మంది అరెస్ట్ మరో ఇద్దరు పరారీ
## - మెటల్ డిటెక్టర్,స్కానర్,లొకేటర్ సహా పరికరాలు స్వాధీనం

**చివ్వెంల సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి):**

గుప్త నిధుల కోసం పురాతన ఆలయాల పరిసర ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును చివ్వెంల పోలీసులు రట్టు చేశారు.ఉండ్రుగొండ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పురాతన ఆలయాల సమీపంలో తవ్వకాలకు పాల్పడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.గ్రామస్తుల సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు సెప్టెంబర్ 6న తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో కేషరాజు కుంట కట్ట వద్ద తనిఖీలు చేపట్టారు.అక్కడ అనుమానాస్పదంగా తవ్వకాలు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు.వారి వద్ద నుంచి గుప్త నిధుల అన్వేషణకు వినియోగిస్తున్న మెటల్ డిటెక్టర్, స్కానర్,లొకేటర్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.ఉండ్రుగొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ చైర్మన్ చకిలం కృష్ణకుమార్ ఫిర్యాదు మేరకు చివ్వెంల ఎస్ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సూర్యాపేట రూరల్ సీఐ జి. రాజశేఖర్ ఆధ్వర్యంలో కొనసాగిన దర్యాప్తులో ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారుఅరెస్టయిన వారు: పచ్చిపాల మధు, యల్లాల శ్రీకాంత్, భూతరాజు శివ, నకిరేకంటి గోపి, చర్లపల్లి ప్రణయ్‌కుమార్, రాపాని తిరుపయ్య, కడారి సైదులు, భూక్యా తులశ్య అలియాస్ తుకారాం నాయక్.స్వాధీనం: మెటల్ డిటెక్టర్,స్కానర్, లొకేటర్, ఆరు సెల్‌ఫోన్లు,ఒక ట్యాబ్, డ్యూయట్ స్కూటీ (టూ29 ఖీ 4244).గుప్త నిధుల పేరుతో జరిగే మోసాలను ప్రజలు నమ్మవద్దని పోలీసులు సూచించారు.ఇలాంటి అనుమానాస్పద,అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.




# యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ ఆధ్వర్యంలో అత్యాధునిక యూరాలజీ సేవలు

**నల్లగొండ. సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

యశోద హాస్పిటల్స్, సోమాజిగూడలో యూరాలజీ, ఆండ్రాలజీ మరియు రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ విభాగాల ద్వారా ఆధునిక వైద్య సదుపాయాలు, రోగి కేంద్రిత చికిత్సను అందిస్తున్నామని యూరాలజీ అండ్ ఆండ్రాలజీ స్పెషలిస్ట్ డా. మధుసూదన్ రెడ్డి తెలిపారు.జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర ఫ్యామిలీ రెస్టారెంట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కిడ్నీ మరియు యూరినరీ స్టోన్స్, ప్రోస్టేట్ సమస్యలు, మూత్ర మార్గ ఇన్ఫెక్షన్లు, మూత్రం ఆగిపోవడం వంటి సాధారణ సమస్యల నుంచి క్లిష్టమైన యూరాలజీ పరిస్థితుల వరకు అవసరమైన పరీక్షలు, సరైన వైద్య సలహా మరియు వ్యక్తిగతీకరించిన చికిత్సను అందిస్తున్నామని తెలిపారు.అత్యాధునిక లేజర్ మరియు ఎండోయూరాలజీ విధానాలతో స్టోన్ చికిత్సలు, ప్రోస్టేట్ సమస్యలకు మినిమల్లీ ఇన్వేసివ్ మరియు ఎండోస్కోపిక్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటి ద్వారా తక్కువ కోతలు, తక్కువ నొప్పి మరియు వేగవంతమైన కోలుకునే అవకాశం ఉంటుందన్నారు.యూరో–ఆంకాలజీ విభాగంలో కిడ్నీ, మూత్రాశయం, ప్రోస్టేట్ క్యాన్సర్లకు ఆధునిక శస్త్రచికిత్సలు, ముఖ్యంగా రోబోటిక్ యూరో–ఆంకాలజీ సర్జరీలు చేస్తున్నామని, ప్రస్తుతం నెలకు సుమారు 10 రోబోటిక్ సర్జరీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఆండ్రాలజీ విభాగంలో పురుషుల వంధ్యత్వం, లైంగిక




ఆరోగ్య సమస్యలకు గోప్యత, గౌరవంతో సమగ్ర చికిత్స అందిస్తున్నామన్నారు.రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ విభాగంలో డోనర్ మూల్యాంకనం, లాపరోస్కోపిక్ డోనర్ నెఫ్రెక్టమీ మరియు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సేవలను అందిస్తున్నామని, ప్రస్తుతం నెలకు సుమారు 5 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్లు చేస్తున్నామని తెలిపారు.యూరాలజీ, ఆండ్రాలజీ లేదా కిడ్నీ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సరైన సమయంలో నిపుణుల సలహా తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో హాస్పిటల్ మేనేజర్ ఉమేష్, అసిస్టెంట్ మేనేజర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను సమీక్షించిన డీఎస్పీ రవి

**వేములపల్లి సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి) :-**

వేములపల్లి మండల కేంద్రంలోని నాగార్జున సాగర్ ఎడమ కాలువలో గణేష్ నిమజ్జన కార్యక్రమానికి చేయవలసిన ఏర్పాట్లపై డీఎస్పీ రవి గురువారం రూరల్ సీఐ ప్రసాద్, స్థానిక ఎస్సై డి. వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా డీఎస్పీ రవి మాట్లాడుతూ... గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలువ వద్ద భక్తులకు ఎలాంటి ప్రమాదాలు, ప్రాణనష్టం జరగకుండా తగిన రక్షణ ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత పోలీసు సిబ్బందికి సూచించారు.





# ఘనంగా ముత్యాలమ్మ పండుగ

**చింతలపాలెం, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

చింతలపాలెం మండల కేంద్రంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ముత్యాలమ్మ తల్లి పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, యువతులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను తలపై ధరించి భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ తల్లి ఆలయానికి ఊరేగింపుగా తరలివెళ్లారు. ఆలయానికి చేరుకున్న అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. అనంతరం డీజే చప్పుళ్లతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి, కుటుంబ సభ్యులతో కలిసి వన భోజన కార్యక్రమంలో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో చిత్తలూరి వీరబాబు, కారంగుల బ్రహ్మం, బత్తిన సుబ్బయ్య, కొండలు తదితరులు పాల్గొన్నారు.

# బలవంతపు మరణాలు వద్దు.. ప్రాణం పోద్దాం..

**నూతనకల్, ..సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఆత్మహత్యలపై మన కథనాన్ని మార్చుకుందాం, జీవితం కోసం ప్రతిజ్ఞ, ఆత్మహత్య నివారణ ప్రతిజ్ఞలో మాతో కలిసి పాల్గొనండి అని మండల వైద్యాధికారి కీసర ఆశ్రిత రెడ్డి గురువారం ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనలో ప్రతి ఒక్కరికి ఒక ప్రాణాన్ని కాపాడే శక్తి ఉందని, కొన్నిసార్లు సరైన సమయంలో ఒకరి మాట వినడం వారి పరిస్థితిని గమనించడం లేదా వారికి అండగా నిలవడం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడవచ్చని,మానసిక ఆరోగ్యం సమస్యలు వయసు నేపథ్యంతో సంబంధం లేకుండా ఎవరికైనా ఎదురు కావచ్చని,ఒంటరిగా ఉన్నామని లేదా సాయం అడగడానికి భయపడుతున్నామని భావించడం వల్ల చాలామంది తమ బాధను మౌనంగా భరిస్తున్నారు. ఈ ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మనమంతా కలిసి ఎవరితో అత్యంత కష్టమైన సమయాలను ఒంటరిగా ఎదుర్కోకుండా ఉండేలా ఒక సహాయక సమాజాన్ని నిర్మించడాన్ని ప్రతిజ్ఞ చేద్దామని పేర్కొన్నారు. ప్రతి ప్రాణానికి విలువనిచ్చి అందరికీ శ్రద్ధతో కూడిన సహాయక వాతావరణంలో ఏర్పరచడానికి నా వంతు కృషి చేస్తాను, ఆత్మహత్యలు, మానసిక ఆరోగ్యం గురించి భయం అపోహలు,మౌనం తగ్గేలా బహిరంగంగా, సున్నితంగా మాట్లాడుతానని భావోద్వేగ బాధ లేదా పుస్తములో ఉన్న వారి మాటలను సానుభూతితో ఎటువంటి తీర్పు లేకుండా వింటాను భావోద్వేగ బాధకు సంబంధించిన సంకేతాలను తీవ్రంగా పరిగణించి ఇబ్బందుల్లో ఉన్నవారు సమయానికి సహాయం, మద్దతు పొందేలా ప్రోత్సహిస్తాను,నేను భావోద్వేగ బాధను ఎదుర్కొంటున్నప్పుడు, ఆత్మహత్యకు సంబంధించిన ఆలోచనలు వచ్చినప్పుడు మౌనంగా బాధపడకుండా నేను



విశ్వసించే శక్తిని సంప్రదించి వృత్తిపరమైన సాయం కోరుతాను. మానసిక ఆరోగ్య సమస్యలు లేదా ఆత్మహత్యకు సంబంధించిన ఆలోచనలు ఎదుర్కొంటున్న వారిని అవమానించి నిందించనని, వివక్ష చూపనని నా కుటుంబం కార్యాలయం సంస్థ,సమాజంలో ఆశ అనుబంధ కరుణను పెంపొందించడానికి నా వంతు కృషి చేస్తానని నన్ను నేను జాగ్రత్తగా చూసుకోవాలని ఇతరులకు మద్దతుగా నిలవాలని ఆత్మహత్యల నివారణలో నా వంతు పాత్ర పోషించాలని ప్రతిజ్ఞ చేస్తున్నాను. మనమంతా కలిసి ఆత్మహత్యలపై ఉన్న కథనాన్ని మౌనం నుంచి సంభాషణ వైపు అపోహల నుంచి మద్దతు వైపు నిరాశ నుంచి ఆశ వైపు మన నిర్ణయాన్ని మార్చుకుందాం అని పేర్కొన్నారు. మీకు లేదా మీకు తెలిసిన ఎవరికైనా మాట్లాడాల్సిన అవసరం ఉంటే టేలి –మానస్ 14416 –టోల్ ఫ్రీ నెంబర్ 24/6 అందుబాటులో ఉంటుందని వారు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

---

# బ్యాంకు సమ్మెకు సన్నద్ధం

## - ఉద్యోగులంతా ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలి- ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఐతగోని మహేష్ గౌడ్



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి):**

యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించనున్న బ్యాంకు ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఐతగోని మహేష్ గౌడ్ పిలుపునిచ్చారు.గురువారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులు,సిబ్బంది సమ్మెలో సకాలంలో పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు.సమ్మెలో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఉద్యోగులు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొని,అనంతరం నిర్వహించే సమ్మెలో సైతం సకాలంలో భాగస్వాములు కావాలని మహేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

---



# ఎంఈఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా వల్లపట్ల కృష్ణ నియామకం

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి):**

తెలంగాణ మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ గా వల్లపట్ల కృష్ణ నియామకం అయ్యారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన కృష్ణ 1997లో కుసుమవారిగూడెం గ్రామ శాఖ అధ్యక్షులుగా, 2016 లో ఎం ఈ ఎఫ్ డివిజన్ కార్యదర్శిగా, 2017 లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా, 2020 లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా, 2024 నుండి ఇప్పటి వరకు సంఘ జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతూ వచ్చారు. ఈ క్రమంలో కృష్ణ సేవలను గుర్తించిన ఎంఆర్పిఎస్ వ్యవస్థాపకులు,జాతీయ అధ్యక్షులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకత్వం సంయుక్తంగా వల్లపట్ల కృష్ణని రాష్ట్ర ఉద్యోగుల వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ గా ఇటీవలే నియమించినట్లు కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ మాదిగ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణకి పలువురు ఉద్యోగులు, స్నేహితులు,పట్టణ వాసులు శుభాకాంక్షలు తెలిపారు.